ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం

28, 29న టెక్నికల్ ఫెస్ట్

వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటి డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల: ఈనెల 28, 29 తేదీల్లో స్థానిక ట్రిపుల్ ఐటి కళాశాలలో సిఎస్ఇ విభాగం ఆధ్వర్యాన సంవిధాన్ టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నట్లు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు తెలిపారు. ఈ ఫెస్ట్‌కు సంబంధించిన samvedhan.rgutksklm.ac.in వెబ్‌సైట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెస్ట్‌లో భాగంగా కోడింగ్, నాన్ టెక్నికల్ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు, ఎఒ మునిరామకృష్ణ, డీన్ మోహనకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, సిఎస్ఇ హెచ్ఒడి రమేష్, అసోసియేట్ డీన్ రమణ, రవి, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, సిఎస్ఇ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి జ్యోతిభాస్కరరావు
990/1000

పొట్నూరు లహరి
989/1000

జామి ఈక్షిత
989/1000

ప్రేమ చరణ్
465/1000

వైష్ణవి
465/1000

బాలికలదే హవా

- ప్రథమ, ద్వితీయం రెండింటిలోనూ ముందంజ
- ద్వితీయంలో 64 శాతం ఉత్తీర్ణత
- ప్రథమంలో 51 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 11వ స్థానంలో జిల్లా
- 990 మార్కులతో అదరగొట్టిన జ్యోతి భాస్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రెండింటిలోనూ బాలికలు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికలు 70 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 57 శాతం మంది మాత్రమే పాసయ్యారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో బాలికలు 57 శాతం మంది పాస్ కాగా, బాలురులో 43 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బాలికల్లో ఉత్తీర్ణతా శాతంతో జిల్లా పరువు దక్కింది. లేకుంటే ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలిచేది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండింటిలోనూ 11వ స్థానం దక్కింది. ఒకేషనల్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండో స్థానం దక్కింది. వ్యక్తిగత మార్కుల పరంగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు.

ఈ ఏడాది మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 21,752 మంది హాజరు కాగా 14,019 మంది (64 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 11,913 మంది బాలికలకు గానూ 8,397 మంది ఉత్తీర్ణత (70 శాతం) సాధించారు. బాలురుల్లో 9,839 మంది పరీక్షలు రాయగా 5,622 మంది (57 శాతం) పాస్ అయ్యారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు మొత్తం 22,775 మంది హాజరు కాగా 11,516 మంది (51 శాతం) పాసయ్యారు. వారిలో బాలికలు 12,559 మంది పరీక్షలు రాయగా 7,119 మంది (57 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురుల్లో 10,216 మంది పరీక్షలకు హాజరుకాగా 4,397 మంది (43 శాతం) మంది పాసయ్యారు.

జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం వివరాలు

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు	శాతం
2018-19	25,630	15,930	62
2019-20	28,818	14,380	50
2020-21	29,729	29,729	ఆల్ పాస్ (కరోనా)
2021-22	26,052	14,729	57
2022-23	21,752	14,019	64

ఒకేషనల్‌లోనూ బాలికలదే పైచేయి

ఒకేషనల్‌లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1681 మంది హాజరు కాగా 1094 మంది (65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులోనూ బాలికలతో పైచేయిగా ఉంది. పరీక్షలకు 899 మంది బాలికలు హాజరు కాగా 674 (75 శాతం) పాసయ్యారు. 782 మంది బాలురు పరీక్షలు రాయగా, 420 మంది (54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 2049 మంది హాజరు కాగా 1038 మంది (51 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో భాలికలే అత్యధిక మంది పాసయ్యారు. పరీక్షలకు 1139 మంది బాలికలు హాజరు కాగా 726 మంది (64 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 910 మంది బాలురు హాజరు కాగా 312 మంది (34 శాతం) మందిఉత్తీర్ణులయ్యారు.

కె.తేజ
466/470

ప్రవళిక
464/470

ఎంపిసిలో 990 మార్కులతో అదరగొట్టిన జ్యోతి భాస్కర్

ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపిసి విభాగంలో రెడ్డి జ్యోతి భాస్కర్ 1000 మార్కులకు గానూ 990 మార్కులు సాధించారు. ఎంపిసి విభాగంలో జామి వీక్షితకు 989 మార్కులు వచ్చాయి. పొట్నూరు లహరి 989 మార్కులు సాధించారు.

ఇంజినీర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 990 మార్కులు సాధించిన రెడ్డి జ్యోతి భాస్కర్ శ్రీకాకుళం మండలం కిల్లిపాలెంలో ఉంటున్నారు. జ్యోతి భాస్కర్ పదో తరగతి వరకు విశాఖ మోడల్ స్కూల్ చదివి పదికి పది పాయింట్లు సాధించారు. ఇంటర్ శ్రీచైతన్య కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 465 మార్కులు తెచ్చుకున్నారు. తల్లి సాయమ్మ కాంట్రాక్టు ఉద్యోగి కాగా, తండ్రి రెడ్డి వెంకటరమణ ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఇంజినీరింగ్‌లో స్థిరపడాలన్నదే తన లక్ష్యమని జ్యోతి భాస్కర్ చెప్పారు.

ఐఐటి చేయాలనుకుంటున్నాను

మహాలక్ష్మి నగర్ కాలనీ ఈక్షిత పదో తరగతి వరకు శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చదివి పదికి 9.8 మార్కులు సాధించారు. తల్లి గృహిణి కాగా, తండ్రి ఎన్ఎసిఎల్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

ఐఐటి ర్యాంకు సాధనే లక్ష్యం

గార మండలం కొయ్యానపేటకు చెందిన లాహిరి అరసవల్లిలోని కేశవరెడ్డి స్కూల్‌లో పదో తరగతి చదివి 9.8 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు గోవిందరావు, సంధ్యారాణి కిరాణా వ్యాపారం చేస్తున్నారు. ఐఐటిలో మంచి ర్యాంకు సాధించాలన్న లక్ష్యం సాధన సాగిస్తున్నానని చెప్పారు.

ప్రథమంలో ఇద్దరికి అత్యధిక మార్కులు

ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో డి.ప్రేమ్ చరణ్, బరాటం వైష్ణవి అత్యధిక మార్కులు వచ్చాయి. 470 మార్కులకు గానూ 465 మార్కులు వచ్చాయి. కానూరు తేజ, పిల్లా ప్రవళ్లిక 464 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో బగాది హేమలత, పొట్నూరు కీర్తి 430 మార్కులు దక్కించుకున్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులపై పలువురు అభినందనలు తెలిపారు. తమ కళాశాలలో చదివి అగ్రస్థానంలో నిలబడిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల డీన్ కె.మురళీధర్, ఎజిఎం నర్సునాయుడు అభినందనలు తెలిపారు. ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

శాస్త్రీయ కోణంలో కేసుల దర్యాప్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని శాస్త్రీయ కోణంలో సైబర్ కేసులను దర్యాప్తు చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల ఛేదన, నిందితుల అరెస్టు తదితర అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒటిపి, కెవైసి, జాబ్, లోన్, ఆధార్, కస్టమర్ కేర్ ఫ్రాడ్స్ తదితర సైబర్ కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే నేర విధానాన్ని పరిశీలించి కేసులను దర్యాప్తు చేయాలని సూచించారు. సామజిక మాధ్యమం ద్వారా గోప్యతను భగ్నం చేయడం, బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, భద్రతకు ముప్పు వాటిల్లే తరుణంలో సైబర్ నేరాల స్థితిగతులు, పరిణామాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. ప్రతిఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించుకుని సైబర్ నేరాల నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల్లో నేరగాళ్లను అదుపులోకి తీసుకునేందుకు మొబైల్ ఫోన్ చాలా కీలకంగా మారుతుందన్నారు. ప్రస్తుత కాలంలో ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల బాధితుల వ్యక్తిగత వివరాలు, అకౌంట్లలో నగదు తస్కరించిన తర్వాత టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు మహేంద్ర, ఎం.శివరామిరెడ్డి, సిఐలు బి.ప్రసాదరావు, పి.శ్రీనివాసరావు, ఎల్.సన్యాసినాయడు, ఈశ్వర్ ప్రసాద్, రవిప్రసాద్, శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మిక పర్యటనలో భాగంగా విధి నిర్వహణలో ఆలసత్వం ప్రదర్శించారన్న అభియోగంపై మండల విద్యాశాఖాధికారి, హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయులకు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పరిశీలనలో గుర్తించిన అంశాలపై వివరణ ఇవ్వాలని ఎంఇఒ డి.నాగభూషణంకు ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారి... కండ్రవీది ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్యామలాదేవి, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు యు.వి రమణ, ఎ.సురేష్‌కు జిల్లా విద్యాశాఖాధికారి టి.తిరుమల చైతన్య నోటీసులు ఇచ్చారు.

ఆప్కో లక్ష్యం రూ.250 కోట్లు

ఆప్కో ఛైర్మన్ జి.చిరంజీవి

మాట్లాడుతున్న ఆప్కో ఛైర్మన్ చిరంజీవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పొందూరు

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆప్కో వ్యాపార లక్ష్యం రూ.250 కోట్లుగా నిర్ణయించినట్లు ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, డైరెక్టర్ ఎ.వై సుబ్బారాయుడు తెలిపారు. బుధవారం జిల్లాలో పర్యటించిన వారు శ్రీకాకుళం నగరంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చేనేత జౌళి శాఖ, మండల వాణిజ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. పొందూరులో సాయిబాబా చేనేత సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. చేనేత కార్మికులకు 365 రోజులు పనికల్పించే విధంగా ప్రణాళికలను చేపడుతున్నామని తెలిపారు. ఏడాదంతా ఆప్కో ద్వారా 30 శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. మారుతున్న కాలానుగుణంగా వస్త్రాల తయారు చేయాలని కార్మికులకు సూచించారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లోని వర్క్ షెడ్‌ల్లో పనిచేస్తున్న చేనేత కార్మికులకూ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం 2018 నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తూ మృతి చెందిన 98 మంది చేనేత కార్మికుల వారసులకు రూ.12,500 చొప్పున ఆప్కో ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు.

ఈ పథకం కింద పరిహారాన్ని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం రూ.25 వేలకు పెంచిందని తెలిపారు. తొలుత ప్రజా బంధు ప్రగాడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు, డిఒ శేఖర్, లీలాకుమార్ ముఖర్జీ, ఆప్కో డివిజనల్ వాణిజ్య అధికారి సోమేశ్వరరావు, మన్యం జిల్లా చేనేత సంగం అధ్యక్షులు గెడ్డం నర్సింగరావు, ఎస్.సూరిబాబు, సాయిబాబా వీవర్స్ సొసైటీ అధ్యక్షులు వట్టం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

- షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి
- ప్రవీణ్ ప్రకాష్ తీరు అభ్యంతరకరం
- ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆందోళన

డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై అక్రమంగా చేసిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఇదే డిమాండ్‌పై జిల్లాలోని పలు మండలాల్లో ఉపాధ్యాయులు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రకాష్ తీరు ప్రభుత్వ విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేసే విధంగా ఉందని విమర్శించారు. వ్యవస్థలో లోపాలను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారి వ్యవస్థ మొత్తాన్ని లోపాల పుట్టగా చూపిస్తున్నారని చెప్పారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులను నిందించడం, మెమోలు, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లతో భయభ్రాంతులకు గురిచేస్తూ మొత్తం లోపమంతా ఉపాధ్యాయులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాఠశాలల పనివేళల్లో కాకుండా సెలవు రోజుల్లో రాత్రిపూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పర్యవేక్షణ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, నోట్స్ దిద్దడం మాత్రమే పని అని, ఇది కూడా చేయకుండా రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారని ఉపాధ్యాయులను అవమానిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. విద్యా సంబంధ విషయాల్లో లోపాలను గుర్తించినప్పుడు వాటిని పై అధికారిగా ఉపాధ్యాయులకు తెలియజెప్పి దాన్ని సరిదిద్దాలన్నారు. పూర్తి వైఫల్యం ఉపాధ్యాయులదే అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి పర్యటనలు అంటూ మొత్తం విద్యా వ్యవస్థని ప్రయివేటు విద్యను ప్రోత్సహించేలా చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ఎపిటిఎఫ్ (1938) నాయకులు టి.చలపతిరావు, పిఆర్‌టియు నాయకులు కేశవరావు, ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

పలాస తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. యుటిఎఫ్, ఎపిటిఎఫ్, తదితర సంఘాల నాయకులు బి.సుభాష్‌బాబు, బల్ల చిట్టిబాబు, ఎం.భుజంగరావు, కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి పాత తాలూకా కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. తొలుత తహశీల్దార్ నుంచి కచేరి వీధి, ఇందిరాగాంధీ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు బోడ్డేపల్లి నేతాజీ, బాబురావు, కురమాన దాలయ్య, పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట తాలూకా కేంద్రంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, బి.కేశవరావు, కె.ఆదినారాయణ, టి.సుధీర్, పి.నరసింహమూర్తి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

సోంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. తొలుత తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ మండపం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేష్ పాణిగ్రాహి, జి.భీమారావు, ఎస్.వెంకటరావు, బి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎల్.కరుణాకర్, హెచ్.శివప్రసాద్, పి.పోలినాయుడు, సామ సంజీవరావు, ఎల్‌వి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు కార్యక్రమంలో యుటిఎఫ్, డిటిఎఫ్, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు పొందూరు అప్పారావు, పూజారి హరిప్రసన్న, గురుగుబెల్లి గోపాలరావు, సత్యనారాయణ, బొడ్డేపల్లి మధుబాబు పాల్గొన్నారు.

50,895 మందికి 'వసతి దీవెన'

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 50,895 మంది విద్యార్థులకు జగనన్న వసతి దీవెన కింద రూ.47.86 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ శ్రీకేష లాఠకర్ తెలిపారు. అనంతపురం జిల్లా నార్పలలో వసతి దీవెన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించగా, వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర ప్రొఫెసనల్ కోర్సులు చదువుకుంటున్న విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయని తెలిపారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, బిసి సంక్షేమఅధికారి ఇ.అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.గడ్డెమ్మ, పలు కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 12వ బ్యాచ్ శిక్షణా తరగతులు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటివరకు సుమారు 200 మంది శిక్షణ తీసుకున్నారని తెలిపారు. శిక్షణ పొందిన వారిలో చాలామంది ఉపాధి అవకాశాలు పొందారని చెప్పారు. ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ తీసుకోవడం వల్ల రాబోయే రోజుల్లో ఆర్‌టిసితో పాటు మిగతా ప్రభుత్వశాఖల్లోనూ ఉద్యోగవకాశాలు ఉంటాయని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్, మెకానికల్ వర్క్, యోగా, ఫస్ట్ ఎయిడ్ క్లాసులు కూడా బోధించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకోనున్న అభ్యర్థులకు పుస్తకాలను అందజేశారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం 9963091999, 7382921920 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

2 నుంచి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పాతపట్నం

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ మే రెండు, మూడు తేదీల్లో కలెక్టరేట్ వద్ద 48 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. స్థానిక ఆదివాసీ భవనంలో నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన, సంస్కృతి సంప్రదాయాలతో సంబంధం లేని బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ మార్చి 24న శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల బోయ, వాల్మీకులు, నకిలీ బెంతు ఒరియాలను ఎస్‌టిలుగా గుర్తించడం వల్ల గిరిజనులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిషత్ నాయకుడు బి.సింహాచలం మాట్లాడుతూ రెండు రోజుల నిరవధిక దీక్షకు ప్రజా సంఘాలు, కార్మిక, కర్షక, ఉపాధ్యాయ, దళిత సంఘాలు సంఘీభావం తెలపాలని కోరారు.

విలీన పంచాయతీల్లో తాగునీటికి డిపిఆర్

సమీక్షిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.123 కోట్లతో రూపొందించిన డిపిఆర్‌ను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పరిశీలించారు. పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, డిపిఆర్ రూపొందించిన సిస్ట్ కంపెనీ ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ప్రస్తుత నగర జనాభా సుమారు రెండు లక్షలు ఉందని, రానున్న 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుంటే మూడు లక్షలు దాటే అవకాశం ఉందన్నారు. అందుకనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం అందించేందుకు రూ.123 కోట్లతో డిపిఆర్ రూపొందించినట్లు తెలిపారు.

నగరానికి రోజుకు 20 ఎంఎల్‌డిల తాగునీరు ప్రస్తుతం అవసరమవుతోందని, పంచాయతీల విలీనం తర్వాత 16 ఎంఎల్‌డిల నీటిని అందించే విధంగా డిపిఆర్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఆదివారంపేట ఎగువ ప్రాంతంలో పది ఎంఎల్‌డిలు, బలగలో ఐదు ఎంఎల్‌డిలకు సంబంధించి చేపడుతున్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దపాడు పంచాయతీ పరిధిలో 1200 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జూన్ 1 నాటికి 'నాడు-నేడు' పూర్తి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాడు-నేడు పనులు జూన్ ఒకటో తేదీ నాటికి శతశాతం పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఇంజినీర్లను ఆదేశించారు. మనబడి నాడు-నేడు రెండో దశ పనులు, మరుగుదొడ్లు, కిచెన్లు తదితర అంశాలపై ఎంఇఒలు, ఇంజినీర్లు, ఎపిఎంలతో జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కింద జిల్లాలో 1096 జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నిధులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా ఆలస్యం కాకుండా పనులు కొనసాగించాలన్నారు. నాడు-నేడు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనులు కొనసాగేలా చూడాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, ఎంఇఒలు, మండల ఇంజినర్లు, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నివారణకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఐసిడిఎస్ పిఒలను ఆదేశించారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, బాలామృతం తదితర వాటిపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత గల పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఫోలిక్ యాసిడ్ మాత్రలు తదితర వాటిని పంపిణీ చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్లు డేటా ఎంట్రీ సరిగా చేయకపోతే సంబంధిత సిడిపిఒలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిడిపిఒలు ప్రతినెలా టూర్ డైరీ అందజేయాలన్నారు. స్టాక్ సరఫరా అయి పిల్లలు, గర్భిణులకు సరఫరా చేయని అంగన్వాడీ వర్కర్లను సస్పెండ్ చేయాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు ఆధార్ అప్డేషన్‌కు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ జి.జయదేవి, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
S.O.P. 3/2023

Between:
1.Baratam Jayalakshmi w/o late Rama Seshu aged 35 years, Rlat D.No: 1-308/1 main street, Sreekuramam village, Gara Mandal, Srikakulam Dist.
2. Baratam satya Sai Subhakar s/o late Rama Seshu rest.do.
3. Baratam Hasini s/o late Rama seshu rest do. (Petitioners 2 and 3 are being minor's ref. by their mother Ist Petitioner)
4. Baratam Nageswararao S/o late Satyanarayana rest do-
5. Baratam Leelavathi w/o Nageswararao rest. do. **-Petitioners**
And: Nil **-Respondent**

PUBLIC NOTICE

Notice is hereby given to the general Public that application was made to the court by the above named Petitioners for the grant of Succession Certificate in their favour under **Sec.372** of to the Indian Succession Act, in respect of transfer of security deposit of **Rs.2,00,000/-** and Distributor of **Damestic LPG M/s SRI KURMANADHA SWAMY BHARAT GAS GRAMIN VITRAK, SREEKURMAM** pertaining to late Rama Seshu who died on **06-12-2022** and that if any body is having right or interest in the said amount and Distributor of Domestic LPG may appear and file objEctions and claims if a any on **02-05-2023 at 10.30 AM.** before the said court. if no objections are received, the court grants the relief as prayed in the above Case

//By order of the Court //

Srikakulam,
Date: 25-04-2023

A.SURESH
Advocate,
Srikakulam,
Cell: 94403 21433.

రికార్డులను పరిశీలిస్తున్న సీతారాం

అంగన్వాడీలపై పర్యవేక్షణ ఉండాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అంగన్వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్ పర్యవేక్షణ ఉండాలని, అటువంటిప్పుడే గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందాల్సిన సరుకులు పక్కదారి పడకుండా ఉంటుందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. మండలంలోని కింతలిలో అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆకస్మిక తనికీని జరిపారు. ఈ సందర్భంగా 1,3 కేంద్రాలు ఇరుకుగదుల్లో నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో అంగన్వాడీ కేంద్రం-1లో చిన్నారులు లేకపోగా, రికార్డుల్లో పూర్తి హాజరు వేయడాన్ని గుర్తించారు. స్టాక్ వివరాలు కూడా ముందుగానే నెలరోజులకు నమోదు చేయడాన్ని గుర్తించారు. ఈ విధంగా కేంద్రాలు తీరు, రికార్డుల నిర్వహణఉంటే మీరు ఏమి పర్యవేక్షణ చేస్తున్నారని సూపర్‌వైజర్ జి.వి.రత్నంపై మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వాహణపై సిడిపిఒతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈయన వెంట చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ నాగరాజు ఉన్నారు.

ఎంపికైన కాకినాడ ఆదిత్య విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 351 మంది ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆరో సెమిస్టర్‌లో ఉండగానే 351 మంది ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీలో నియాకానికి ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి తెలిపారు. బుధవారం నిర్వహించిన ఎంపిక అనంతరం విద్యార్థులకు నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగం అవసరమని అన్నారు. ఈ అవసరాన్ని నెరవేర్చుకునేందుకు ఆదిత్య విద్యా సంస్థలు తోడ్పాటు అందిస్తున్నాయని అన్నారు. ఈ నియామకాలు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నాయన్నారు. కళాశాలలో చేరిన నాటి నుంచి విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం వల్లే పోటీని తట్టుకుని ప్రాంగణ ఎంపికల్లో విజేతలుగా నిలుస్తున్నారని తెలిపారు. ఉద్యోగ నియామకాలు పొందిన విద్యార్థినులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు, అభినందనలు తెలిపారు.

వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

టెక్కలి: వ్యవసాయంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖాధికారి జి.రంగారావు పిలుపునిచ్చారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మోదుగువలస గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా విభాగం శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ సమాజంలో కాలానికి ఆనుగుణంగా వ్యవసాయంలో మార్పులు రావాలని అన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్ బి.పవన్ రైతుభరోసా కేంద్రం పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు ఎల్.ఢిల్లేశ్వరరావు, కె.అజయ్, ఎం.తవుడు, ఎన్ఎస్ఎస్ పిఒ.వి.లూక్‌పాల్ పాల్గొన్నారు.

మందస : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బిజెపిని గద్దె దించాలి

ప్రజాశక్తి- మందస

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన దేశ వ్యాప్తంగా ప్రచార భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మోడీ గద్దె దిగే వరకూ ఈ పోరాటం సాగుతుందని నాయకులు కె.మోహనరావు, సిహెచ్.సుందర్‌లాల్ స్పష్టం చేశారు. ప్రచార భేరీ కార్యక్రమంలో హరిపురంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పణంగా కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ఎపికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా దగా చేస్తుందని దుయ్యబట్టారు. ఉపాధి అవకాశాలు దెబ్బ తీసి, సంక్షేమ పథకాలను నీరు గార్చి పేదలను మరింత పేదలుగా మార్చి, కోటీశ్వరులను శత కోటీశ్వరులుగా చేస్తుందని అన్నారు. మనుషులు మధ్య మత కల్లోలాలు సృష్టిస్తూ పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.గణపతి, సిహెచ్.వేణుగోపాల్, ఆర్.దిలీప్‌కుమార్, ఎం.ధర్మారావు, ఎస్.లచ్చయ్య పాల్గొన్నారు.

29న పలాసలో బహిరంగ సభ

ఈ నెల 29న పలాసలో ముగింపు సందర్భంగా బహిరంగ సభ నిర్వహిస్తున్నామని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు పాల్గొంటారని అన్నారు. ఈ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట ఆర్.గణపతి, ఆర్.దిలీప్, చాపర సుందర్‌లాల్, వేణు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికుల, పెన్షన్‌దార్లను మోసం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీని గద్దెదించి దేశాన్ని కాపాడాలని సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో భాగంగా నగరంలోని హడ్కో కాలనీ, శాంతినగర్, రిమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో బుధవారం ప్రచారం నిర్వహించి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవిపాణిగ్రహి, ఎస్.శ్రీనివాసులు, వెంకటరావు పాణిగ్రహి, బి.సూరీడు, లక్ష్మణ, బి.మాధవ, లక్ష్మి, దుర్గ, పార్వతి, లక్ష్మణ్, సాయి, అప్పారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపిని సాగనంపాలని సిపిఎం నాయకులు బి.ఆనందారావు పిలుపునిచ్చారు. ప్రచార భేరీలో భాగంగా స్థానిక చిన్నకొత్తూరు, కిడిసింగి, తడివాడ, డోకులపాడు, చినవంక, పల్లిసారధి ప్రాంతాల్లో ప్రచారం చేపట్టి ఇంటింటికీ పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.భాస్కరరావు, బిసుగుణావతి, డి.భానుమతి, బి.రామకృష్ణ, డి.భాస్కరరావు, ఎస్.సింహాచం, ఎస్.ఈశ్వరమ్మ, పి.అప్పారావు. కృష్ణవేణి, కుమార్ పాల్గొన్నారు.

గార : గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పని కల్పించి వలసలు నివారణకు స్వస్తి పలకాలని ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ చట్టానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిధులను తగ్గించి నీరుగారుస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మండలంలోని రామచంద్రాపురంలో చేపడుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కార్మికులకు పోస్టర్లను అందజేశారు. 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డోల శంకర రావు, కొమర భాస్కరరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు పట్టా ప్రభావతి, రామచంద్రాపురం గ్రామ సిపిఐ శాఖా కార్యదర్శి లాపాటి పున్నమ్మ, సహాయ కార్యదర్శి సీర దమయంతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

కావ్య

గాయత్రి

సుస్మిత

'టిఎస్ఆర్' ప్రతిభ

ఆమదాలవలస : పట్టణంలోని టిఎస్ఆర్ కాలేజీ విద్యార్థినులు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఎంపిసిలో నానుపాత్రుని సుస్మిత 1000 మార్పులకు గాను 984 మార్కులు సాధించి కాలేజీలో మొదటి స్థానం సంపాదించారు. నారా గాయత్రి ఎంపిసిలో 1000 మార్కులకు గాను, 982 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే బైపిసి విభాగంలో ఎన్ని కావ్య 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మెరిసిన 'విద్యా వాహిని'

పలాస: కాశీబుగ్గకు చెందిన విద్యా వాహిని జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపిసిలో నీలాపు ధనలక్ష్మి 985 మార్కులు సాధించింది. పండా దమయంతి 982, పి.హేమలత 977 మార్కులు సాధించారు. ప్రథమ ఎంపిసిలో లోళ్ల మోనిక 463 మార్కులు సాధించింది. కళాశాల టాపర్గఆ నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులు పైబడి 25 మంది, ప్రథమ సంవత్సరంలో 400 పైబడి 40 మంది విద్యార్థులు మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు తెలిపారు. అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ తిరుమలరావు

'ఎస్‌కెకె' ప్రతిభ

మెళియాపుట్టి : స్థానిక ఎస్‌కెకె జూనియర్ కళాశాల లో జె.శిరీష్ ఎంపిసిలో 969 మార్కులతో ప్రథమ స్థానం, సునీత 967 మార్కులతో ద్వితీయ, ఇప్పిలి ప్రీతి బైపిసిలో 968 మార్కులతో ద్వితీయ స్థానంలో ప్రతిభ కనబరిచారు.

శిరీష

ప్రీతి

'స్వర్ణభారతి' విజయభేరి

పూజ

టి.దీప్తి

ఇచ్ఛాపురం: ఇంటర్ ఫలితాల్లో స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు విజయభేరి మోగించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఎంపిసిలో నిమ్మన పూజా 986 మార్కులు, బైపిసిలో దీప్తి 978 మార్కులతో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాలు నిలిచారు. ఎంపిసిలో 978 మార్కులతో ఎర్ర మహేష్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఇంటర్ మొదటి సంవత్స రం ఎంపిసిలో నందుక రాధ 448, ఎం.హరిత 445, ఎల్.దివ్యశ్రీ 443, ఎ.స్నేహ 441 మార్కులు సాధించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను విద్యా సంస్థలు చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితా లు సాధనకు కృషి చేసిన చాట్ల రాము, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు చెప్పారు. ఇంటర్ ఫలితాల్లో స్వర్ణభారతి విద్యా సంస్థలు విజయ దుందుబి మోగించిందని తులసీదాస్‌రెడ్డి అన్నారు.

'ఆదిత్య' ప్రభంజనం

చాందిని

ఇచ్ఛాపురం: మండలంలోని తోట వీధిలోని ఆదిత్య జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో పప్పల రవితేజ 980, బైపిసిలో కళ్యాణి 978 సాధించి, కళాశాల స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. మొదటి సంవత్సరం ఎంపిసిలో కొత్త జాన్సి 458, నెయ్యల చాందిని 458, బైపిసిలో కె.మౌనిక 432, పి.శ్రావణి బాడిత్యా 426 అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సష్టించారు. ఘన విజయం సాధించిన విద్యార్థులకు ఆదిత్య కళాశాల యాజమాన్యం అభినందించింది.

ప్రసన్నకుమార్

రాజేష్

షర్మిల

'చక్రధర్' విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం : ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు 461 మార్కులతో సైరగాపు ప్రసన్నకుమార్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 460 మార్కులతో కుంచాల రాకేష్, ఎన్.వి.ఎస్.షర్మిల 458 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. ఈ విద్యార్థులకు కళాశాల చైర్మన్ యళ్ల చక్రధర్‌రావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

'సూర్యతేజ' విజయకేతనం

శరణ్య

పలాస: సూర్య తేజ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 87శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపిసి చదువుతున్న ఆకుల శరణ్య 987 మార్కులు సాధించింది. బైపిసిలో తామడ సరిత 983, దాసరి వాసవి 980, ఎంపిసిలో నెయ్యిల రేఖా 980, సిగలపల్లి అఖిల 977, లొడగల మనీషా 974, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో టౌన్ టాపర్‌గా బమ్మిడి దేవికి 463 మార్కులు సాధించారు. ఎంపిసిలో బత్తిని పల్లవి 461, రాపాక ప్రసన్న 459, సిఈసిలో నిఖిల పండా 468, తనుజా త్యాడి 458 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులు పైబడి 42 మందికి, ప్రథమ సంవత్సరంలో 400 పైబడి 62 మంది విద్యార్థులు సాధించినట్లు సూరితేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ కామేశ్వరరావు తెలిపారు.

'శాంతినికేతన్' విజయబావుటా

శ్రీకాకుళం : ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసిలో దున్న మణి 461, దేసల్ల లక్ష్మణరావు 457/470 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపిటిసి పి.దినేష్ 971, డి.రవి, 969 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బైపిసిలో బి.జ్యోత్స్న 914, బి.రూస్సీ 911 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే 400పైబడి 25 మందికి, 900 పైబడి 21 మందికి మార్కులు వచ్చాయి. వీరికి కళాశాల కరస్పాండెంట్ సురంగి మోహనరావు, డైరెక్టర్లు నాగార్జునప్రతాప్, కొర్ను పావని, ప్రిన్సిపాల్ ఎన్.అప్పలరాజులు అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన ఎస్‌విజె

కవిటి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక ఎస్‌విజె విద్యార్థులు సత్తాచాటారు. ప్రథమ సంవత్సరంలో టి.కావ్య(407), డి.ప్రభ (404), ద్వితీయ సంవత్సరం బైపిసిలో ఐ.అనిత(947), జల్లు సిందుజ(944) మార్కులతో సత్తా చాటినట్టు కరస్పాండెంట్ బెందాళం కింగ్ తెలిపారు. స్థానిక బిఎస్ఆర్ కళాశాలలో ఎస్.దివ్య(906) మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

తహశీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి- జలుమూరు

తహశీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఎసిబి అధికారులు తనిఖీ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు సకాలంలో సేవలు అందజేయాలని ఎసిబి సిఐ కె.భాస్కరరావు అన్నారు. బుధవారం జలుమూరు తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ సేవలు అనుకున్న సమయానికి పారదర్శకంగా అందుతున్నాయా లేదా అన్నది పరిశీలన చేసారన్నారు.. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎసిబి ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తహశీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో తనిఖీలు నిర్వహించి తుది నివేదిక ఉన్నతాధికారులకు అందచేయనున్నామని అన్నారు. అనంతరం కొన్ని పెండింగ్ ఫైల్స్ వివరాలు చర్చించామన్నారు. రాష్ట్ర కార్యాలయానికి 14400కు వచ్చిన ఫోన్ ఆధారంగా ప్రభుత్వ సేవల జాప్యంపై ఫిర్యాదుదారులు నుంచి కూడా వివరాలు సేకరించనున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం దరఖాస్తుదారుడు ఆయా సేవలు పొందేందుకు ఎన్ని రోజులు గడువు ఉంది. లేదా? లంచం ఇవ్వలేదని ఆ ఫైల్స్ పెండింగ్ పెట్టారా, సాంకేతిక కారాణాలు అన్నది అన్నది సరి చూస్తున్నామన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఎసిబి సిఐ భాస్కరరావు

14400 సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎసిబి సిఐ కె.భాస్కరరావు తెలిపారు. ఎవరైనా అధికారులు అర్జీ దారుడు నుంచి లంచం అడిగితే 14400కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈయనతోపాటు ఎస్.ఐ సత్యారావు, సిబ్బంది ఉన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

గార : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడంలేదని, లేబరు అధికారులు తనిఖీలు చేపట్టే పరిస్థితి లేదని, యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయని సిపిఎం నాయకులు ఎస్.షణ్ముఖరావు అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపద్యంలో కార్మికులపై పోరాడి సాధించుకున్న హక్కులన్నీ పోతున్నాయని, చికాగో నగర కార్మికులు చూపిన పోరాట స్ఫూర్తితో ఈ మేడేను దీక్షాదినంగా జరుపాలని అన్నారు. కార్యక్రమంలో అప్పన్న, సింహాచలం, రఘు, అంగన్వాడీ, ఆశా, గ్రానైట్, గ్రీన్ అంబాసిడర్ కార్మికులు పాల్గొన్నారు.

గార : కార్మికుల హక్కుల దినం మే 1 నుంచి మేడే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. గార సిఐటియు మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అంగన్వాడీ కార్యకర్త సుజాత, ఆశా వర్కర్ నీలవేణి, వంట కార్మికులు నాయకులు లక్ష్మి, భవన నిర్మాణ సంఘం నాయకులు పాపారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, ఆటో యూనియన్ నాయుకులు పాల్గొన్నారు.

'ఐతమ్'కు సబ్ కలెక్టర్ అభినందనలు

టెక్కలి రూరల్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అభినందించారు. ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవాశిబిరంలో భాగంగా బుధవారం కె.కొత్తూరులో ఉచిత వైద్యశిబిరం, రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద యూనిట్ల రక్తం సేకరించారు. గ్రామస్తులు, విద్యార్థులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులను సబ్ కలెక్టర్ అభినందించారు. ప్రశంసాపత్రాలు అందించారు. కళాశాల డైరెక్టర్ వివి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మన్మథరావు, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం, అధ్యాకులు దాసరి ప్రకాష్, ఎం.చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ ప్రతినిది పెంకి చైతన్యకుమార్, కో-ఆర్డినేటర్ కె.సత్యన్నారాయణ, డాక్టర్ పాత్రుడు, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల హవా

ఆమదాలవలస : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో బిర్లంగి జ్యోతిక 965/1000, రౌతు పూజిత 950/1000 సాధించారు. అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం ఫలితాల్లో బలివాడ కృష్ణశ్రీ 464/500, ఎస్.పల్లవి 460/500, ఎంపిహెచ్‌డబ్ల్యు విభాగం ప్రథమ సంవత్సరంలో పి.భవాని 457/500, ద్వితీయ సంవత్సరంలో కె.రజిత 985/1000, కె.శైలజ 926/1000 మార్కులు సాధించారు.

లావేరు కెజిబివిలో...

లావేరు : ఇంటర్ ఫలితాల్లో లావేరు కెజిబివి జూనియర్ కాలేజీలో ఉత్తమ ఫలితాలు సాధించామని ప్రిన్సిపాల్ బి.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో 76 శాతం, ద్వితీయ సంవత్సరంలో 80 శాతం ఫలితాలు సాధించామని అన్నారు. ద్వితీయ సంవత్సరంలో జి.స్వాతి 969/1000, జి.మహినికుమారి 968/1000, జి.రాజేశ్వరి 951/1000 మార్కులు సాధించారని అన్నారు. ప్రథమ సంవత్సరంలో కె.శ్రావణి 443, ఎ.జ్యోతిర్మయి 413, కింబూరి శ్రావణి 410 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరికి ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మెళియాపుట్టి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిటిసిలో ఎల్.మధుసూదన్ 965 మార్కులతో ప్రథమ, కుసుమ 932 మార్కులతో ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. బైపిసిలో ఇప్పిలి ప్రీతి 906 మార్కులతో తృతీయ స్థానంలో ప్రతిభ కనబరిచారు.

జి.సిగడాం : ఎపి మోడల్ స్కూల్లో జూనియర్ కళాశాలలో ప్రథమ బైపిసిలో భూపతి ధనుశ్రీ 967, సిహెచ్.వెంకటేష్ ఎంపిసిలో 963, కె.యమునాప్రసాద్ 888, బి.వెంకటలక్ష్మి 759 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపిటిసిలో ధర్మాన మేఘనాద్ 450/470, బైపిసిలో వై.హెచ్.వి.రమణి 411/440, ఎంపిసిలో ఎం.తనూజ 410/500, సిఇసిలో ఎ.వసంత 447/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా సామ్యూల్ లంక తెలిపారు.

కెజిబివి మొదటి సంవత్సరం ఎంపిసిలో కె.లికిత 427, పి.పూజిత 417, వై.సాయిప్రసన్న 409, ఎం.తనుజ 400, ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎస్.భవాని 962, ఎస్.సత్యవతి 952, కె.లావణ్య 917 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు.

బూర్జ : బూర్జ మండలం ఓ.వి.పేట ఆదర్శ పాఠశాలలో బైపిసి ద్వితీయ సంవత్సరంలో కె.లహరి 981, ఎంపిసిలో డి.పూజిత 973 మార్కులు సాధించారు. 87 మంది విద్యార్థులకు 80 మంది ఉత్తీర్ణత సాధించారు.

బాలయోగి గురుకుల పాఠశాలలో ద్వితీయ ఇంటర్‌లో 71 మంది పరీక్షలు రాయగా, 64 మంది ఉత్తీర్ణత సాధించారు. వైసిపిలో రవ్వల మౌళి 955, క్రాంతి భూషణ్ 939 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో అరసాడ కరుణాసాగర్ 454, దండాసి కార్తీక్ 402 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.

నౌపడ : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపిసి నుంచి ఎస్ కార్తీక్ 440, బైపిసి నుంచి కె.రాజేశ్వరి 406, సిఇసి నుంచి ఈ.కనిష్మా 406 మార్కులు సాధించి సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి నుంచి పి.జ్యోతి 955, కె.లక్ష్మి 944 మార్కులు సాధించగా, బైపిసి నుంచి బి.లత 951, ఎ.సుచిత్ర 915 మార్కులు సాధించారు. సిఇసి నుంచి ఎం.కళ్యాణి 873, హెచ్ఈసి నుంచి బి.లీలారాణి 800 మార్కులు సాధించారు. విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపిసిలో కొర్లాపు మీనా కుమారి తన ప్రతిభని చాటుకుందని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జనార్ధన్ రావు తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో బైపీసీ గ్రూపుల్లో మీనా కుమారి 981 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది .మండలంలోని మోదుగువలస గ్రామానికి చెందిన మీనా కుమారి పేద ఇంటి బిడ్డ నాయి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మీనా కుమారి ప్రతిభ సాధించడం పట్ల పలువురు అభినందించారు.

పలాస: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాలలో 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాడ మోహనరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో మోనియా దుదిష్టి 962 మార్కులు సాధించి, కళాశాల టాపర్‌గా నిలిచారు. బైపిసిలో వజ్జ వెన్నెల 945 మార్పు సాధించింది.

ఆర్థికసాయం అందజేస్తున్న కార్మికులు

'శ్యామ్‌పిస్టన్స్' కార్మికుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వరిశాం వద్ద గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమలో పనిచేస్తున్న సరగడపేటకు చెందిన కార్మికుడు సింగవరపు రమేష్ ఇటీవలి అనారోగ్యంతో మృతి చెందారు. కార్మికులంతా స్పందించి తోటి కార్మిక కుటుంబాన్ని ఆదుకోవడానికి ఒక రోజు వేతనం కింద రూ.4,67,400 వసూలు చేశారు. శ్యాంక్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన మృతుడి భార్య ఎస్.శారదకు పరిశ్రమ వద్ద చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో శ్యాంక్రగ్ పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.అప్పలనర్సయ్య, నాయకులు కె.భోగేష్ కె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.


కేక్ తినిపిస్తున్న మంత్రి అప్పలరాజు

ఘనంగా వెంకటరావు జన్మదిన వేడుకలు

పలాస: పలాస పిఎసిఎస్ అధ్యక్షులు, వైసిపి మండల అధ్యక్షులు పైల వెంకటరావు జన్మదిన వేడుకలు ప్రగతి భవన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో మంత్రి అప్పలరాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు కేకును తినిపించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, ఎంపిటిసి జి.మోహనరావు, చింతాడ మోహనరావు, వైసిపి నాయకులు భవానీ, బొర కృష్ణారావు, శిష్టి గోపి, బడగల బల్లయ్య, దువ్వాడ రవి, కొర్ల సంతోష్ పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖకు
రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

టెక్కలి రూరల్ : పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తతంగా అవగాహన కల్పించినందుకు ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయరాజ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ, నమూనాల సేకరణ-1962 సేవలు, కృత్రిమ గర్భోత్పత్తి, పశుగ్రాస విత్తనాలు పంపిణీపై ఈ ఉత్తమ అవార్డు డివిజన్‌కు వచ్చినట్లు తెలిపారు. సమీకృత మిశ్రమదాన, పశు విజ్ఞాన బడి, పశు మత్స్యదర్శిని పుస్తకాల పంపిణీ, పశు చేయూత పథకం, తదితర వాటిపై లక్ష్యానికి మించి సేవలు అందజేశామన్నారు.

వరి, జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

పలాస: వ్యవసాయదారుల ప్రధాన జీవనాధార పంటలైన వరి, జీడి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పలాస పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో సీనియరు సహాయకులు సునందకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెస్త కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది అకాల వర్షాల, వాడగాలుల వల్ల కొన్ని ప్రాంతాల్లో జీడి పంటలు దెబ్బతిన్నాయని, పంటల బీమా పథకం అమలుల్లో ఉన్నా కట్టే విధానంలో ప్రభుత్వ లోపం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. 80కేజీల జీడి బస్తా రూ.16వేలకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కళింగధల్ రిజర్వాయరు నీరు పింపిలి, మూలిపాడు గ్రామాలకు అందించాలని, గోపాల్‌సాగర్ శంకుజోడు, జెన్నాచెరువులు మినీరిజర్వాయర్లు మార్పు చేయాలని కోరారు. జంతిబంద రిజర్వాయరు పనులు, దామోదర్‌సాగర్ కుడికాలువ నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించి, వీటికి వంశధార నదితో అనుసంధానం చేయాలని అన్నారు. ముకుందపురం గ్రామం వద్ద మహేంద్రతనయ నదిలో లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి రైతులను ఆదుకోవాలని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతుసంఘ, ప్రజాసంఘ నాయకులు ఉన్నారు.

వినతిపత్రం అందిస్తున్న కామేశ్వరరావు, తదితరులు

దల్లిపేటలో భూ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దల్లిపేటలో సమగ్ర భూ సర్వేను సర్పంచ్ ప్రతినిది కంబాపు సూర్యారావు బుధవారం ప్రారంభించారు. గ్రామంలో చేపడుతున్న ఈ భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కూన లక్ష్మంనాయుడు, విఆర్ఒ సత్యసాయి, సర్వేయరు నరేష్, సచివాలయం కన్వీనర్ రేగాన విజయ్‌కుమార్, ఎఫ్ఎ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యారావు

కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

రెండు పూటలూ పనిచేయాలి

డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- జి.సిగడాం

ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల మేరకు కూలీలు రెండు పూటలా పనిచేస్తూ కనీస కూలి వస్తుందని జిల్లా నేటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని సంతవురిటి పంచాయతీ పరిధిలోని చెరువులో చేస్తున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. అనంతరం కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ సాధారణంగా బయట పనులకు వెళ్లినట్లయితే మహిళలకు, పురుషులకు కూలిలో తేడా ఉంటుందని అన్నారు. అదే ఉపాధి హామీ పథకంలో మాత్రం మహిళలకు, పురుషులకు సమాన కూలి అందుతుందని తెలిపారు. ఉపాధి హామీ ద్వారా స్థానికంగానే ఉపాధి పొందుతూ మీ గ్రామాల్లో సుస్థిర వనరుల ఏర్పాటు చేసుకునే అవకాశం మీకు కలిగిందన్నారు. వ్యవసాయ ఆయకట్టు స్థిరీకరణ, చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆహార ఉత్పత్తులు పెరగడం, భూగర్భ జలమట్టం పెంపొందడం వంటివి జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యనారాయణ, ఇసి పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఎండోమెంట్ భూములు పరిశీలన

మెళియాపుట్టి: స్థానిక రాధాగోవిందస్వామి ఆలయ భూములను ఎండోమెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి డిప్యూటీ తహశీల్దార్ కృష్ణకుమారి, సర్వేయర్ సీతారామ ఆచారి, అరసవల్లి ఇఒ హరిసూర్య ప్రకాష్, పాతపట్నం ఆలయ ఇఒ వాసుదేవరావు బుధవారం పరిశీలించారు. మెళియాపుట్టికి చెందిన ఎడ్లపల్లి కృష్ణారావు ఎండోన్‌మెంట్ భూముల్లో కొందరు ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తులో భాగంగా ఈ భూములను పరిశీలించారు. అలాగే ఎండోమెంట్ భూములకు సంబంధించి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అదనపు సమాచారానికి పర్లాకిమిడి మహారాజుకి సంబంధించి వారసులను కలిసేందుకు వెళ్లారు.

బాధితులకు అండగా 'ఉద్దానం యూత్ క్లబ్'

కవిటి: మండలంలోని పెద్ద బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బచ్చల శేఖర్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డునపడింది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారు దిక్కులేనివారయ్యారు. మృతునికి తల్లితో పాటు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. వీరి పరిస్థితి తెలుసుకున్న బొరివంక ఉద్దానం యూత్‌క్లబ్ బుధవారం రూ.8 వేలు నగదుతో పాటు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు దీనబందు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో అసిరిపోలమ్మ అమత కలశంలో భాగంగా ప్రతి నెలా నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. మద్దిలి కేశవరావు, ఢిల్లీషు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లిలో ఎపిజివిబి తాడివలసశాఖ ఆధ్వర్యాన ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగదు రహిత లావాదేవీలు, పలు బీమా పథకాలు, రైతులకు అందజేస్తున్న రుణాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతాడ మాధురి, ఎంపిటిసి మాజీ సభ్యులు చింతాడ వెంకటసత్యప్రసాద్, బ్యాంకు మేనేజర్ అరుణకుమారి, నోడల్ ఆఫీషర్ రాఘవేంద్ర, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

బారువ బీచ్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బారువ బీచ్‌లో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఎపి మారిటైమ్ బోర్డు సిఇఒ బిఎం.రవీంద్రనాథ్ రెడ్డిని సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో ఆయనను కలిసి కవిటి, సోంపేట మండలాల్లో మినీ జెట్టి, మినీ కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. బారువ బీచ్‌లో వసతులు, అభివృద్ధి పనుల కోసం వినతి పత్రం అందించినట్లు తెలిపారు. వీటి అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలో క్షేత్రస్థాయి పర్యటనకు వస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఫలించిన కంద్ర కులస్తుల పోరాటం

ఇచ్ఛాపురం: 20 ఏళ్లుగా కంద్ర కులస్తులు చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. బిసిడి నుంచి బిసిఎలో మార్పు చేయడంపై ఒరియా మైనారిటీ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఒరియా బాపూజీ గ్రంథాలయంలో ఒరియా మైనారిటీ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఒరియా మైనారిటీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి మాట్లాడుతూ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కంద్ర కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దష్టికి తీసుకెళ్లడంతో సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రఘునాథ్ గౌడ్, శివప్రసాద్ పండా, రాజేంద్ర పండా, శ్రీనివాస దాస్, రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో సదుపాయాలు కల్పించాలి

టెక్కలి: పట్టణంలో ఉన్న పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించడం లో యాజమాన్యాలు విఫలం అయ్యాయని, వీటి వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి రాయి సునీల్ కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో దోపిడీ జరుగుతోందన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు నివారించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఆందుకు తగిన సౌకర్యాలు లేవన్నారు. కనీసం ఆట స్థలం లేదని, వ్యాపార ధోరణికే ప్రథమ స్థానం ఇస్తున్నారని చెప్పారు. ఆయనతో పాటు జనసేన పార్టీ నాయకులు శ్యాం, సంజురెడ్డి, శివ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ రెమ్యూనరేషన్‌కు కొత్త రేట్లు చెల్లించాలి

శ్రీకాకుళం అర్బన్ : పదో తరగతి పరీక్ష పేపర్ల దిద్దుబాటు విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు కొత్త రేట్ల ప్రకారం స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లించాలని ఎస్‌టియు అధ్యక్షులు పడాల తమ్మినాయుడు కోరారు. ఈ మేరకు డిఇఒ తిరుమల చైతన్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగోన్నతులు పారితోషికం రూ.2,500 చెల్లించాలని కోరారు. 2018 హిందీ పండిట్లకు కమిషనర్ ఉత్తర్వుల ప్రాప్తికి జీతాలు చెల్లించాని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌టియు కార్యర్శులు ఎస్.వి.రమణ, పేడాడ ప్రభాకరరావులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సోంపేట : సామాజిక సేవలో భాగంగా బుధవారం సోంపేట పోలీస్ స్టేషన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఐ రవిప్రసాద్ తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా బాటసారులకు, వాహనదారులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో గ్రామాల్లో సైతం చలివేంద్రల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన భువనేశ్వరిదేవి పండగలు

పోలాకి : ప్రియాగ్రహారంలో ఈ నేల 16న ప్రారంభమైన భువనేశ్వరి దేవి అమ్మవారు సిరిమాను పండగలు బుధవారంతో ముగిసాయి. చివరి రోజు ఏర్పాటు చేసిన విందుకు చుట్టాలు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 11ఏళ్లకు ఒక్కసారి నిర్వహించిన పండగలకు జిల్లా నలు మూలలు నుండి జన సమూహం తరలి రావడంతో సుమారు మూడు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, సర్పంచ్ బి.నూకరాజు, ఎంపిటిసి ఎస్.ప్రసాద్‌రావు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దాతకు నివాళి

కంచిలి: తాను చనిపోతూ మరో ఐదుగురికి ప్రాణ దానం చేసిన సోంపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి మల్లారెడ్డి కిరణ్‌చంద్‌కు శ్రీ కంచమ్మ తల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నివాళులర్పించారు. తమ బిడ్డను కోల్పోతున్నామనే బాధలో సైతం మరొకరికి సాయం చేయాలన్న విద్యార్థి తల్లిదండ్రుల త్యాగాన్ని అభినందిస్తూ, కిరణ్‌చంద్ చిరంజీవిగా నిలిచిపోతావంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో యూనియన్ సభ్యులతో పాటు స్థానిక యువత, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తారు

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చంద్రబాబుకు ఎన్నికల సమయంలోనే ప్రజలపై ఎక్కడాలేని అభిమానం పుట్టుకొస్తుందని మంత్రి సీదిరి అప్పలరాజు ఎద్దేవా చేశారు. బుధవారం రాజాం సర్పంచ్ పిట్ట గీతారాణి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట మీద నిలబడే గుణం చంద్రబాబుకు మొదటి నుండీ లేదన్నారు. సిఎం జగన్ బటన్ నొక్కి డబ్బులు పంచుతున్నారని విమర్శిస్తూ వచ్చిన చంద్రబాబు ఎన్నికల ముంగిట ఇంతకంటే ఎక్కువ సంక్షేమం ఇస్తామని చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. ప్రజలను వంచించే విద్య చంద్రబాబుకి తెలిసినట్లు ఎవరికీ తెలియదన్నారు. పలాస నియోజకవర్గంలో 60 ఏళ్లు పాలించిన గౌతు కుటుంబం ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వలస నాయకులకు ఇక్కడ స్థానం లేదని మరోసారి నిరూపించడానికి ఇక్కడ ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినాన శాంతారావు, ఎంపిటిసి పిట్ట సుగుణ రామారావు, పిట్ట జోగారావు, పైల అప్పారావు, వైస్ సర్పంచ్ బూర్లె రామారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బుధవారం మండలంలోని కొఠారిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో పిరియా సాయిరాజ్, ఎంపిపి బి.పుష్ప, పైలా దేవదాస్‌రెడ్డి, ఉప్పాడ నారాయణమ్మ, మోహన్‌రావు, రాజారెడ్డి, డి.ధనలక్ష్మి, పి.విశ్వనాథం, దక్కత నూకయ్య, చిట్టిబాబు, నీలాపు జగదీష్, సారథి, ఎన్.చక్రవర్తి, బతలక మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని ప్రతి గ్రామంలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన పనులను వేగవంతం చేసి ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలని అన్నారు. ఒక్కో మండలానికి 270 నుంచి 300 వరకు ఇల్లు వచ్చాయని, ఎవరైనా కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి ఇంట్రెస్ట్ ఉంటే సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ని కలిసి నమోదు చేసుకోవాలని అన్నారు. హౌసింగ్ అధికారులు పాజిటివ్ దక్పథంతో పనిచేయాలని సూచించారు. వంశధార అధికారులు గైర్హాజరపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ రెగ్యులేషన్ సమయంలో సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని, సమావేశానికి వచ్చిన సభ్యులకు వంశధార అధికారులు హాజరు కాకపోతే ఎలా అని నగరికటకం ఎంపిటిసి బగ్గు రామకష్ణ ఆగ్రహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ దామోదరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండల అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. తహశీల్దార్ బి.సత్యం మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది గ్రామాల్లో జిరాయితీ భూములకు స్టోన్ ప్లాంటేషన్ జరుగుతోందన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఉపాధి పనుల్లో సమయపాలన పాటించడం లేదని,పాటించేలా చర్యలు తీసుకోవాలని నగరికటకం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కష్ణదాస్

ఎంపిటిసి అధికారులకు సూచించారు. శ్రీకాకుళం నుండి ఆముదాలవలస, సరుబుజ్జిలి, కొమనాపల్లి మీదుగా శ్రీముఖలింగానికి, పాలకొండ నుంచి సరుబుజ్జిలి, కొమనాపల్లి మీదుగా టెక్కలి, పలాసకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ మేనేజర్‌కు ఎంపిపి వాన గోపి కోరారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు తంగి మురళీకష్ణ, డోల నాగరత్నం, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, మండల వ్యవసాయ అధికారి కె.సురేష్, విద్యాశాఖ అధికారి బి.మాధవరావు, జలుమూరు, సైరిగాం, అచ్యుతాపురం పిహెచ్‌సి వైద్యాధికారులు టి.శ్రీకాంత్, పి.గురునాథరావు, కె.అప్పారావు, హౌసింగ్ ఎఇ, ఐసిడిఎస్ పిఒ,పాల్గొన్నారు.

బూర్జ : ర్యాలీలో మాట్లాడుతున్న రవికుమార్

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

బూర్జ: వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని డొంకలపర్త పంచాయతీ వై.పర్తలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిసి రోడ్లు లేవని, వీధి దీపాలు వెలగడం లేదని పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణకు అనేకమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదని అల్లిన పంచాయతీ కిల్లంతరికి చెందిన రఘుమండల పార్వతి, లక్ష్మీనారాయణ, రమణమ్మ, వై.భారతి, ఎస్.తిరునాథమ్మ, కె.నిర్మల, దుర్గమ్మ, కె.సత్యవతిలు ఎన్‌టిఆర్ సవ్యతిలు ఆయన మొరపెట్టుకున్నారు. దేశాయి ఛానల్ ద్వారా నాలుగేళ్లుగా సాగునీరు రాకపోవడంతో పంటలు నష్టం వాటిల్లుతున్నాయని గంగాభగీరథపురం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వి.రాంజీ నాయుడు, ఎ.అప్పలనాయుడు, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.రామకృష్ణ, టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పి.కన్నంనాయుడ, జి.పోలినాయుడు, సర్పంచ్ అంపిలి గణపతిరావు, కె.వెంకట్ సీతారామరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని దుప్పిలపాడులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు తర్ర రామక్రిష్ణ, మండల అధ్యక్షులు బోయిన రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, శైలజ, డి.సింహాద్రమ్మ, బి.రమణమ్మ, రాంకుమార్, గోవింద, సత్య శ్రీనివాస్, సునీల్, హెచ్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ప్రజాశక్తి - కవిటి

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధులను నివారించవచ్చని డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి అన్నారు. మండలంలోని కపాసుకుద్ది గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాల నేపథ్యంలో గ్రామస్తులకు, స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు విజృంభించడంతో స్థానిక వైద్యులు, నాయకులతో మాట్లాడారు. జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకూ వైద్య శిబిరం నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ గ్రామంలోని పరిస్థితులను తనకు నివేదించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ శశిధర్, సర్పంచ్ కాయ దమయంతి, నాయకులు కాయ భీమసేన్, వైద్య సిబ్బంది అభిమన్యు, బెండాళం శివ ప్రసాద్, కేశవ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మందులు, సెలైన్లు సిద్ధం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: గ్రామ దేవత సంబరాలు సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర మందులు, సెలైన్లు సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి వైద్య అధికారులకు

సర్పంచ్ తో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ఆదేశించారు. బుధవారం ఉత్సవాల సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఉత్సవ మండపంలో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివద్ధి కమిటీ ఈ సందర్భంగా మీనాక్షిని ఘనంగా సన్మానించారు. అనంతరం బెల్లుపడ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సిసి ఎవి నారాయణరావు, డాక్టర్‌లు చలమజీ, ప్రదీప్ పాల్గొన్నారు.

టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- పలాస

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు ప్రతి కార్యకర్తా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలలో వైసిపి ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకంగా ప్రచారం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మందస మండలం హరిపురంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణపై టిడిపి కస్టర్, యూనిట్ బూత్ ఇన్‌ఛార్జిలకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వెసిపి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, వైసిపిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటి నుంచి గ్రామాల్లో విస్తతంగా పర్యటించి ప్రజలకు

మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రభుత్వ విధానాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు నవీన్, బావన దుర్యోధన, దాసరి తాతారావు యాదవ్, మూడు మండల అధ్యక్ష కార్యదర్శులు, ట్రైనర్స్ సంతోష్,మోహన్ కష్ణ, విజయ ప్రధాన, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ లెవెల్ ఏజెంట్స్ పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై శిక్షణ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల సోషల్ ఆడిట్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ పర్సన్ వసంతరాజారావు పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను, విద్యార్థుల సామర్థ్యాయులు, పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, విద్యార్థుల ఆరోగ్యం, మనబడి నాడు-నేడు పనుల నిర్వాహణ, పాఠశాలలో అమలవుతున్న సహ పాఠ్యాంశాలు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, వివిధ సంక్షేమ కార్యక్రమాలు వంటి వాటిపై ఏ విధంగా ఆడిట్ నిర్వహించవల్సి ఉంటుందో తెలియజేశారు. ఈ వివరాలను ఒక ప్రత్యేకమైన యాప్ ద్వారా నమోదు చేసి సమర్పించాలని తెలిపారు.

ప్రముఖుల పరామర్శ

పలాస : మాజీ ఎంపీ కణితి విశ్వనాథం కుటుంబాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధర్మాన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశ్వనాథం ఎంపీగా, నేను మంత్రిగా కలిసి పని చేశామని, జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. ఆయన మృతి తీరనిలోటు అని అన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్, చింతాడ మంజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, మామిడి శ్రీకాంత్ ఉన్నారు.

అచ్చెన్న పరామర్శ: కణితి విశ్వనాథం కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కణితితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష, లొడగల కామేష్, గురిటి సూర్యనారాయణ, జి.చంద్రరావు, ఆత్మారావు ఉన్నారు.

పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు, శిరీష

కొబ్బరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కవిటి: సమగ్ర సస్యరక్షణ చర్యలతో కొబ్బరిలో తెగుళ్లను నియంత్రించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల ప్రసాదరావు అన్నారు. కొబ్బరిలో వచ్చే రూగూస్ సర్పిలాకర తెల్లదోమ నియంత్రణ, సస్యరక్షణ చర్యలపై కవిటి డివిజన్ విఎఎ/విహెచ్ఎలకు బుధవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్కార్సియా గ్వాడెలోపే అనే బదనికలు కొబ్బరి తోటలో విడిచిపెట్టడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి పోలాకి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులకు అవకాశం కల్పించాలి


నిరసన తెలుపుతున్న యజమానులు

టెక్కలి: మినరల్ డీలర్స్ లైసెన్స్ ఆన్‌లైన్ విధానాన్ని కొనసాగిస్తూ గ్రానైట్ పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకులను ఎగుమతులు చేసుకునేందుకు వీలుగా ఆవకాశం కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్ర గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక భూగర్భ గనుల శాఖ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నెల రోజులుగా పరిశ్రమ ఉత్పత్తులకు ఆన్‌లైన్ విధానం ద్వారా ఎగుమతులకు ఆవకాశం కల్పించకపోవడంతో నష్టానికి గురికావాల్సి వస్తోందన్నారు. ఎండిఎల్ పోర్టల్ ఆన్‌లైన్‌లో నిలిపివేయడం వల్ల క్వారీ నుంచి బ్లాకులను ఎగుమతి చేసుకోలేకపోతున్నామని వాపోయారు. దీంతో పరిశ్రమలు మూసేయాల్సి వస్తుందన్నారు. కార్మికులు రోడ్డున పడతారని తెలిపారు. ఎండిఎల్ పోర్టల్ పునరుద్ధరణ చేసే వరకు పరిశ్రమలు మూసివేస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు గోపీ, రమాకాంత్‌రెడ్డి, ప్రశాంత్, మహేష్‌పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

బాధిత కుటుంబానికి అండ

శ్రీకాకుళం : పోలీస్‌శాఖలో పనిచేసి మృతి చెందిన బాధిత కుటుంబాలకు పోలీస్‌శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో కె.అరుణ స్వీపర్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ మంజూరు చేసింది. ఈ చెక్కును సూపరింటెండెంట్ కార్యాలయంలో మృతురాలి కుమారుడు కె.తరుణ్‌కుమార్‌కు ఎస్‌పి రాధిక బుధవారం చెక్కును అందజేశారు. మృతురాలి కుటుంబానికి రావాల్సిన మిగిలిన ప్రయోజనలు సకాలంలో అందేటట్లు చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు, పరిపాలన అధికారి ఎం.శివరామరాజు పాల్గొన్నారు.

చెత్త రీసైక్లింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వీధుల్లో వృథాగా పారబోస్తున్న చెత్తను సేకరించి వాటి ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందుతున్న రిగ్‌పిక్కర్సు గ్రేడింగ్‌పై అవగాహన పెంచుకుని రీసైక్లింగ్ ప్రక్రియ చేపడుతున్నామని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కె.రామారావు తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో చెత్త సేకరణ, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి రిసైక్లింగ్ చేసే పద్ధతులపై బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్లాస్టిక్, చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు సేకరించే వారికి గ్రేడింగ్, రీసైక్లింగ్‌కు వేల్యూఎడిషన్ విక్రయాల ద్వారా అధిక ఆదాయం, ఉపాధి పొందడానికి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఈ శిక్షణలో 150 మంది పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్‌కుమార్, నగర కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారి రమణమూర్తి, స్వచ్ఛంద సంస్థల నుంచి కొమ్మురమణమూర్తి, ఆర్.జి.కోటి, పి.సుధాకర్ పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కామరాజు

లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

బూర్జ : మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి ఎపి ఎస్ఐడిసి డిపార్ట్‌మెంట్ డిఇ ఎం.కామరాజు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తే ఎన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందని స్థానిక నాయకుల నుంచి వివరాలు సేకరించారు. నీలాపురానికి ఆనుకొని ఉన్న నాగావళి నది వద్దకు వెళ్లి కూడా స్థలాన్ని పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అధికారులకు అంచనా వేయమని అప్పుడు స్పీకర్ ఆదేశాలు జారీ చేశారని, ఇప్పుడు ప్రతిపాదనలు పంపడంతో అధికారులు వచ్చి స్థలాన్ని పరిశీలించారని అన్నారు. ఎఇ బి.అనిల్, టిఎ బి.శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాయుడు, గృహ సారథులు రాము, యోగి, రమణ పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

నేత్రాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి డాక్టర్ కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కళ్యాణి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 19 మందికి నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ నేత్రాల సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ముందుగానే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజారావు

మినీ ట్రాక్టర్ అందజేత

సోంపేట : ప్రభుత్వం రైతులకు అన్నివేళలా అండగా ఉంటుందని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. గ్రామానికి చెందిన ప్రగతి రైతు సేవ సంఘానికి మంజూరైన మినీ ట్రాక్టర్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ యంత్ర సేవ పథకంలో భాగంగా సబ్సిడీతో ఈ ట్రాక్టర్ ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. రైతులకు అన్ని విధాల అండగా ఉంటున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎఒ నరసింహమూర్తి, ఉద్యానవనశాఖ సిబ్బంది జీవిత, ఎంపిటిసి పి.రమణమూర్తి, రైతు సంఘం సభ్యులు మోహనరావు, దిద్ది రాజారావు పాల్గొన్నారు.

సీనియర్ జడ్జిగా సన్యాసినాయుడు

టెక్కలి: టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోరుకు జడ్జిగా సన్యాసినాయుడు బాధ్యతలు స్వీకరించారు. గతంలో జడ్జిగా విధులు నిర్వహించిన హరిత అనంతపురం జిల్లా గుత్తి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో జిల్లా కోర్టు నుంచి సన్యాసినాయుడుని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ మేరకు బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద మర్యాద పూర్వకంగా కలుసుకుని, సన్యాసినాయుడుని అభినందించారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని తామడ పంచాయతీ రాయనింగరిపేటకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గొర్లె రామకృష్ణ తండ్రి శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు శ్రీరాములు కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు ఈ సందర్భంగా సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట గోవిందపురం, కొత్తకోట మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, లంకలపల్లి మలేశ్వరరావు, శ్రీను, సతివాడ గురునాయుడు ఉన్నారు.